

దాసాంజనేయుని సేవలో స్పీకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయస్వామిని మంగళవారం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ దర్శించుకుని పూజలు చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,200 వరకు పలికింది.



సత్తా చాటిన క్రీడాకారులు

పెనమలూరు: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం కానూరులో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

న్యూస్‌రీల్

26న ముఖ్యమంత్రి రాక

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

గుంటూరు వెస్ట్: పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాల్లో భాగంగా జగనన్న కాలనీల్లోని పేదలకు ఇంటి స్థలాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందజేయనున్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి ఈ నెల 26న తుళ్లూరు మండలం వెంకటపాలెం రానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం 9.50 గంటలకు ముఖ్యమంత్రి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు వెంకటపాలెం చేరుకుంటారు. అక్కడ 15 నిమిషాలపాటు లేఅవుట్స్‌కు సంబంధించిన ఫొటో గ్యాలరీ తిలకిస్తారు. లబ్ధిదారులతో ఫొటోలు దిగిన తర్వాత అంటే 10.25 గంటలకు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి వేదికపైకి వెళ్లి ఆహ్వానితులతో మాట్లాడిన తర్వాత 10.55 నుంచి 11.40 వరకు అంటే 45 నిమిషాలు ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. 11.40 నుంచి 10 నిమిషాలు పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. 11.55 నుంచి 12.20 వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. తిరిగి 12.30 గంటలకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారు.

సి'విల్ పవర్'

- సివిల్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా
- రెంటచింతల యువకుడికి 292వ ర్యాంకు
- అచ్చంపేట అభ్యర్థికి 550వ ర్యాంకు

రెంటచింతల: సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో జిల్లా యువకులు సత్తాచాటారు. టాప్ ర్యాంకుల్లో మెరిశారు. రెంటచింతలకు చెందిన పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి 292వ ర్యాంక్ సాధించి పల్నాటి కీర్తిప్రతిష్టలను నలుదిశల చాటాడు. విష్ణువర్ధన్‌రెడ్డి రెంటచింతల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియంలో 7వ తరగతి వరకు, విజయవాడ నిర్మల హైస్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు ఇంటర్మీడియెట్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాల (ఇంద్ర టవర్స్)లో, గోవా బిట్స్ పిలానిలో బీటెక్ ఈఈఈ పూర్తిచేశాడు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌లో (ఐఎఫ్ఎస్) 2020 ఫలితాలలో నాలుగో ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. చిన్నప్పటి నుంచి సివిల్ సర్వీస్‌పై ఉన్న మక్కువ ఉన్న విష్ణు వర్ధన్‌రెడ్డి ఎప్పటికైన సివిల్ ర్యాంక్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుని 2017లో న్యూఢిల్లీలో ఓ ప్రవేట్ శిక్షణ కేంద్రంలో చేరి కృషి, పట్టుదల, అకుంటిత దీక్షతో 5వ ప్రయత్నంలో 2022లో 292 ర్యాంక్ సాధించి పల్నాడు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. ప్రస్తుతం పుణేలో పీజీ చేస్తున్నాడు.

కుటుంబ నేపథ్యం




పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి

విష్ణువర్ధన్‌రెడ్డి తల్లిదండ్రుల స్వగ్రామం వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తండ్రి నరసింహారెడ్డి విజయవాడ కానూరులోలోని శస్త్ర అకాడమీ డైరెక్టర్‌గా, తల్లి పద్మావతి తుళ్ళూరు మండలం మందడం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సోదరి తేజశ్రీ ఏలూరు జిల్లా పిఎస్ కొలన్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు.

సమాజసేవ చేయడమే లక్ష్యం..

ఐపీఎస్‌లో శిక్షణపొంది సమాజసేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ 292 సాధించి పల్నాడు జిల్లాకే గర్వకారణంగా నిలిచిన విష్ణువర్ధన్‌రెడ్డిని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నవీన్ చక్రవర్తి ప్రతిభ



నవీన్ చక్రవర్తి

అచ్చంపేట: తాళ్లచెరువు గ్రామానికి చెందిన రేపూడి నవీన్‌చక్రవర్తి 550వ ర్యాంకు సాధించాడు. నవీన్ తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. తండ్రి రేపూడి జయ్‌పాల్ రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయునిగా, తల్లి విజయలక్ష్మి గుంటూరు మునిసిపల్ హైస్కూలులో సెకండరీగ్రేడ్ టీచరుగా పనిచేస్తున్నారు. 30 ఏళ్ల వయస్సు కలిగిన నవీన్‌చక్రవర్తి ప్రాథమిక విద్యను ఆర్సీఎం స్కూల్ జగ్గయ్యపేటలో, ఉన్నత విద్యను నల్లపాడు లయోలా హైస్కూలులో, జూనియర్ ఇంటర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, మెడిసిన్ కోర్సును సిద్ధార్థ మెడికల్ కాలేజీ విజయవాడలో పూర్తిచేశారు. అయితే డాక్టర్ ప్రాక్టీస్ చేయకుండా సివిల్స్‌లో సీటు సాధించేందుకు గత ఏడాది ఢిల్లీలో కోచింగ్ తీసుకుని ర్యాంక్ సాధించలేక పోయాడు. అయినా నిరుత్సాహ పడకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ఏడాది కూడా ఢిల్లీలోనే కోచింగ్ తీసుకుని ర్యాంకు సాధించాడు. తాను ఐఏఎస్, ఐపీఎస్ , ఐఆర్ఎస్‌లలో ఏదో ఒకటి చేయాలన్న ఆలోచనలో ఉన్నానని, వచ్చిన ర్యాంకును బట్టి మూడింటిలో ఏది వచ్చినా సంతోషంగా చేస్తానని నవీన్‌చక్రవర్తి తెలిపాడు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి విడదల రజిని, వేదికపై బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పల్నాడు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

జిల్లాపరిషత్ పాలకవర్గం ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, ఇకముందు చేపట్టబోయే అంశాలపై ప్రధానంగా చర్చించింది. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా అభివృద్ధి చెందాయి, ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ, ఆర్బీకేల్లో అందుతున్న సేవలు వంటి అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు నేతలు, అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఇదీ జగనన్న ఏలు'బడి'

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే

- జగనన్న హయాంలో విద్యార్థుల దిశ మారింది
- పేద విద్యార్థులకు చరిత్రలో తొలిసారిగా గుర్తింపు తెచ్చారు
- టెన్త్‌లో ప్రతిభావంతులకు ఆణిముత్యాలుగా గౌరవం
- సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత
- రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్య, వ్యవసాయ, సాగు, తాగునీటిపై చర్చ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి పర్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫలితాల సాధనలో విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దారని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రజిని వైద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై జరిగిన చర్చలో మాట్లాడారు. ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఎం. వేణుగోపాల్‌రెడ్డి, రంజిత్‌బాషా, పల్నాడు జేసీ శ్యాంప్రసాద్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.

ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలి

వ్యవసాయ రంగంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని, తద్వారా అధిక ధరలకు విత్తన విక్రయాలను నిరోధించాల్సి ఉందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయమై మంత్రి రజిని మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతులకు అవసరమైన మిర్చి, పత్తి తదితర పంటలకు సంబంధించిన అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వమే పూర్తి స్థాయిలో సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు జిల్లాల కలెక్టర్లు వ్యవసాయశాఖపై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కోరిన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



హాజరైన ఎమ్మెల్యే కిలారు రోశయ్య ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, కె.ఎస్.లక్ష్మణరావు

వాచ్‌మెన్ల నియామకంపై హర్షం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సీఎం వైఎస్ జగన్‌ను కలిసి చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 5,388 మంది నైట్ వాచ్‌మెన్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంపై హెనీ క్రిస్టినాకు అభినందనలు తెలిపారు. కల్తీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కించడంపై నిలదీశారు. బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ రుణాలు ఇవ్వడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు.

నూతన ఎమ్మెల్సీలకు చోటు

జెడ్పీ స్థాయి సంఘాల్లో స్త్రీ-శిశు సంక్షేమంపై గల 5వ స్థాయి సంఘ సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, నారా లోకేష్ పదవీ కాలం ముగియడంతో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నంను ఎన్నుకున్నట్లు హెనీ క్రిస్టినా ప్రకటించారు. అదే విధంగా తొలిసారిగా జెడ్పీ సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో పాటు బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను సన్మానించారు. సమావేశంలో మూడు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో అపూర్వ ఘట్టం

మంత్రి రజిని మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయన్నారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మఒడితో పైసా ఖర్చు లేని నాణ్యమైన చదువులను చెప్పిస్తున్న ఫలితంగానే ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచారని, ఇది చరిత్రలోనే అపూర్వమైన ఘట్టమన్నారు. ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నగదు పురస్కారాలను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు.

జెడ్పీ నిధులతో..

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆశాజనకమైన ఫలితాలు నమోదు కావడంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. రూ.61 లక్షల జెడ్పీ నిధులతో 36,155 మంది టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేసిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్, మరో రూ.50 లక్షలతో పంపిణీ చేసిన అల్పాహారం ఎంతో ప్రయోజనం చేకూర్చాయన్నారు.

గుంటూరు చానల్ పొడిగింపుపై..

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ గుంటూరు చానల్‌లో తూటికాడ పేరుకుపోయి నీరు నిలిచిపోతోందని సమావేశం దృష్టికి తెచ్చారు. అదే విధంగా వ్యర్థాలతో గుంటూరు చానల్ దుర్గంధ భరితంగా మారుతున్న దృష్ట్యా, పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు చానల్ విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. గుంటూరు నగరాన్ని ఆనుకుని ఉన్న ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని, 60 ఏళ్లుగా నెలకొన్ని ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారాన్ని చూపించామని చెప్పారు. ఈనెల 27న లాంఛనంగా తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్నామని తెలిపారు. పలువురు జెడ్పీటీసీలు సమావేశం దృష్టికి తెచ్చిన వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు.

ప్రతిభా సం'పది'దీ

జగనన్న సంకల్పంతో అందలం

- చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టెన్త్ ప్రతిభావంతులకు గుర్తింపు
- సర్కారు పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రోత్సాహం
- నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో టెన్త్ టాపర్లకు నగదు బహుమతులు
- రాష్ట్రస్థాయిలో టాపర్లకు రూ.లక్ష బహుమానం

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదవడం అదృష్టం

టెన్త్, ఇంటర్మీడియెట్‌లో జగనన్న ఆణిముత్యాలుగా మెరిసిన విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదవడాన్ని తమ అదృష్టంగా భావించాలి. సామాన్య విద్యార్థులు అసాధారణ ఫలితాలను సాధించడం గొప్ప విషయం. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, ఆధునిక బోధనా వసతులతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.

– పి. శైలజ, డీఈవో, గుంటూరు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను వివిధ దశల్లో ఎంపిక చేసి వారికి 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో సత్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం చరిత్రలోనే తొలిసారిగా జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకల వసతులతో పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వం ఫలితాల సాధనలోనూ అదే ఒరవడి కొనసాగించింది. టెన్త్, ఇంటర్‌లలో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో టాపర్లుగా ఎంపిక చేసిన ప్రభుత్వం వారికి నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. గుంటూరు జిల్లా లో విద్యార్థులతో జాబితాలను సిద్ధం చేసిన విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు వారికి నగదుతో పాటు పతకం, ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహుకరించనున్నారు.

25న నియోజకవర్గ స్థాయిలో సత్కారాలు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన తొలి ముగ్గురు టాపర్లకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.ఐదు వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు. 25న ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆయా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ విధంగా నియోజకవర్గ స్థాయిలో 23 మంది టెన్త్ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్‌లో 15 మంది విద్యార్థులు ఉన్నారు.

27న జిల్లాస్థాయిలో సత్కారం

జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఈనెల 27న సత్కరించనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేయనున్నారు.

31న రాష్ట్రస్థాయిలో సత్కారం

టెన్త్, ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈనెల 31న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో వరుసగా రూ. లక్ష, రూ.75 వేలు, రూ.50 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు.

వరాల రేడు.. తీర్చే గోడు

- సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం
- మా బాధలు తీర్చారు
- కొండంత అండగా నిలిచారు
- పలువురు ఆపన్నుల ఆనందం

గుంటూరు వెస్ట్: ఎన్నో ఏళ్ల నుంచి పడుతున్న ఆవేదన, ఇబ్బందులు ఒక్కసారిగా పరిష్కారమైపోతే గుండె లోతుల్లో నుంచి భావోద్వేగం బాష్పాల రూపంలో పొంగుకొస్తోంది. దేవుడే దిగివచ్చినట్టు హృదయం కృతజ్ఞతా భావంతో ఉప్పొంగుతోంది. సరిగ్గా ఇలాంటి ఘటనే గుంటూరులో జరిగింది. మాతృవియోగంతో బాధపడుతున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిని పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నగరానికి వచ్చిన సందర్భంగా పలువురు తమ సమస్యలు విన్నవించుకున్నారు. వారి గోడు విన్న వెంటనే సీఎం పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆపన్నుల సమస్యలు పరిష్కరించారు. ఫలితంగా ఇది కలా.. నిజమా అన్నట్లుగా ఉందని, సాయంత్రానికి సమస్యలు తీర్చారని బాధితులు ఆనందంతో సీఎంను ఆశీర్వదించారు. ఆయన రుణం తీర్చుకోలేనిదని ఉద్వేగభరితమయ్యారు. లబ్ధిదారుల మనోగతం వారి మాటల్లోనే..

ఉపాధికి సాయం చేశారు



నాకు ఏడాది క్రితం కిడ్నీలో ఏర్పడ్డ కణితిని తొలగించారు. అప్పటి నుంచి ఏ ఉద్యోగం లేదు. దీంతో ముఖ్యమంత్రిని కలిసి నా పరిస్థితిని వివరించా. ఆయన తక్షణ సాయం ద్వారా రూ.లక్ష ఇవ్వడంతోపాటు వైద్య సాయం కూడా అందించాలని ఆదేశించారు. ఇది నాకు పునర్జన్మ. ముఖ్యమంత్రి ఇచ్చిన రూ. లక్షతో జెరాక్స్ షాప్ పెట్టుకుంటా. నా ఉపాధికి సాయం చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– బి.పేరిరెడ్డి, గుంటూరు

నా కొడుక్కి ఉద్యోగం ఇచ్చారు



నా తల్లి నగర పాలక సంస్థలో పనిచేస్తూ మరణించింది. ఆ ఉద్యోగం నాకు ఇచ్చారు. సుమారు ఎనిమిదేళ్ళ క్రితం నా కుమార్తె మరణించింది. అప్పటి నుంచి నాకు ఆరోగ్యం, మనస్సు బాగుండలేదు. విధులకు సరిగ్గా హాజరుకాలేకపోయాను. దీంతో నా ఉద్యోగాన్ని 2015లో తొలగించారు. నేను, నా భర్త బాబు ఇద్దరం అనారోగ్యంతో బాధపడుతున్నాం. నాకు ఉద్యోగం ఇవ్వాలని అధికారుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగా. ఫలితం లేకపోయింది. నాకుమారుడు అఖిల్ కుమార్‌కు నా ఉద్యోగం ఇప్పించాలని జగన్‌బాబును కోరాను. సాయంత్రం కల్లా కలెక్టర్‌గారు నియామక పత్రం అందజేశారు.. మనస్సున్న మారాజు జగన్. ఆయన కలకాలం వర్ధిల్లాలి...

– జె.బాబు, శివలక్ష్మి, గుంటూరు.

జగనన్న దేవుని రూపం



నేను ఇళ్లల్లో పనిచేస్తుంటా. నా భర్త పెయింటర్. పని ఉన్న రోజు కడుపు నిండా తింటాం. లేకుంటే ఇళ్ళల్లో ఇచ్చిన ఆహారమే శరణ్యం. మా రెండో బాబు నవీన్‌కు ప్రస్తుతం ఏడేళ్లు. వాడికి ఆరు నెలల వయస్సు నుంచి థలసీమియా వ్యాధి ఉంది. అప్పటి నుంచి నెలకు రూ.8 వేలు వెచ్చించి రక్తం మార్పిడి చేసే వాళ్ళం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.10 వేలు పింఛన్ ఇవ్వడంతో కొంత తెరిపపడ్డాం. ఆ డబ్బుతోనే రక్త మార్పిడి జరుగుతోంది. టీవీల్లో జగనన్న చేస్తున్న సాయాలు చూస్తూ కలుద్దామని వెళ్ళాం. మా ఇబ్బందులను అన్నకు చెప్పుకున్నాం. సాయంత్రం కల్లా ఏటుకూరు లే అవుట్‌లో ఇంటిస్థల పట్టా ఇచ్చారు. బాబుకు బోన్‌మ్యారో సర్జరీకి ఏర్పాట్లు చేయాలని వైద్యులను ఆదేశించారు.

– వి.కోటేశ్వరరావు, మరియమ్మ, కుమారుడు నవీన్, గుంటూరు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- భౌతిక ఆధారాల సేకరణలో చొరవ చూపాలి
- శిక్షణ ముగించుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేసిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



శిక్షణ ముగించుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భౌతిక ఆధారాల సేకరణలో చొరవ చూపాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. భౌతిక ఆధారాలు సేకరణలో అత్యాధునిక పరికరాల వినియోగంపై మెరుగైన శిక్షణ పొందిన సిబ్బందికి జిల్లా ఎస్పీ మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నేరస్తులు నేరాలు చేసే తీరు రోజురోజుకీ మారిపోతోందన్నారు. వారు చేసిన నేరాన్ని కోర్టులో నిరూపించాలంటే నేరస్థలంలో సేకరించిన భౌతిక సాక్ష్యాధారాలు ఎంతో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. కొన్ని సందర్భాల్లో నేరస్థలంలో కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్లో పాతపద్ధతిలో భౌతిక సాక్షాధారాలను సేకరించడం సాధ్యపడటం లేదన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని భౌతిక ఆధారాలను సేకరించాలన్నారు. ఎప్పుడైతే నేరం చేసినప్పుడు కచ్చితంగా పోలీసులకు పట్టుబడతాము అనే భయం ముద్దాయికి ఉంటే నేరం చేయటానికి భయపడతాడతారన్నారు. అది సాంకేతిక పరిజ్ఞాన్ని సమర్థవంతంగా వినియోగించినప్పుడే సాధ్యపడుతుందన్నారు. శిక్షణలో భాగంగా ఫింగర్ ప్రింట్ యూనిట్, క్లూస్ టీంకు చెందిన ఎస్ఐ టి.శ్రీనివాసరావును, ఐదుగురు పోలీస్ కానిస్టేబుల్స్, ఏపీ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఆధ్వర్యంలో విజయవాడలోని రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నిర్వహించిన 'క్రైమ్ సీన్ ప్రాసెసింగ్' శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీరకుమారి సైంటిఫిక్ అసిస్టెంట్ వై. సూర్యనారాయణ, ఫింగర్ ప్రింట్ యూనిట్ క్లూస్ టీం ఎస్ఐ టి. శ్రీనివాసరావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు రాజధానిలో ఉండకూడదనేదే బాబు ఆలోచన

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున

మంగళగిరి: పేద ప్రజలు రాజధానిలో ఉండకూడదనేదే చంద్రబాబు ఆలోచన అని, చంద్రబాబు చెంపచెళ్లు మనే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వబోతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సీఆర్‌డీఏ పరిధి కృష్ణాయపాలెంలోని ఆర్-5 జోన్‌లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగా ర్జున మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన చంద్రబాబు చెంప చెళ్లు మనిపించే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 50 వేల మందికి పైగా పేదలకు ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వనుండటం నిజంగా పేదల అదృష్టమన్నారు. ఆర్-5 జోన్‌లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఎందుకు ఇవ్వకూడదో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం రాష్ట్రంలో విరాజిల్లుతుందనేదానికి నిదర్శనం, నిలువుటద్దం రాజధాని ప్రాంతంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదురొడ్డి పేదలకు నివేశన స్థలాలు ఇవ్వడమేనన్నారు.

గత 967 రోజులుగా ఈ ప్రాంతంలో దళిత, బహుజనులు ఏకమై చంద్రబాబు తీరును వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు.

ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షాలు పేదల సమస్యలపై పోరాడేవని, నేడు ప్రతిపక్షాలన్నీ కలసి అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని పోరాటం చేయడం ఎంత వరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. ఓ సామాజిక వర్గం పక్కన అణగారిన వర్గాలు ఉండకూడదనేదే వారి ఆలోచన అని, సీఆర్‌డీఏ లో భూములన్నీ చంద్రబాబు, లోకేషలు వారి సొంత భూములు అయినట్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు వేళాయె

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- ఉద్యోగోన్నతులకు సీనియార్టీ జాబితా విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు, ఉద్యోగోన్నతులు
- లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ కానున్న 1,500 మంది ఉపాధ్యాయులు


బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాఠశాల విద్యాశాఖాధికారుల కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు. లాంగ్ స్టాండింగ్ విభాగంలో అన్ని కేడర్ల ఉపాధ్యాయులు బదిలీ కోరుతూ బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో విధిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అదే విధంగా పరస్పర బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. బుధ, గురు, శుక్రవారాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేచోట ఐదు విద్యా సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులతో పాటు ఎనిమిది విద్యాసంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు లాంగ్ స్టాండింగ్ విభాగంలో తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ఈ విధంగా లాంగ్ స్టాండింగ్‌లో 1,500 నుంచి రెండు వేల మందికి స్థాన చలనం కలుగనుంది. అదే విధంగా జీరో సర్వీసుతో అవకాశం కల్పించడంతో రిక్వెస్ట్ బదిలీ కోరుకునే ఆశావహులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసే అవకాశాలున్నాయి. ఒక వైపు బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న విద్యాశాఖాధికారులు మరోవైపు ఉద్యోగోన్నతులకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అన్ని కేడర్ల వారీగా ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులతో సీనియార్టీ జాబితాను విడుదల చేసి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు గుంటూరు డీఈఓ పి.శైలజ మంగళవారం తెలిపారు. ఉద్యోగోన్నతుల జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులందరూ ఉద్యోగోన్నతికి అర్హులేనని, ఉద్యోగోన్నతి పొందుటకు సుముఖంగా లేని వారు ఈనెల 28వ తేదీలోగా రాత పూర్వకంగా తెలియపర్చాల్సి ఉందని స్పష్టం చేశారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బదిలీ దరఖాస్తులను ఈనెల 27వ తేదీలోగా ఆర్జేడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. లాంగ్‌స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులతో దరఖాస్తు చేయించాల్సిన బాధ్యత సంబంధిత డీడీవోలదేనని పేర్కొన్నారు.

తమలో తామే మాట్లాడుకుంటారు..

- వీడని అనుమానాలు వారిలో ఉంటాయి
- మానసిక దుస్థితిపై ప్రభావం
- నేడు వరల్డ్ స్కీజోఫ్రీనియా డే

'ప్రత్తిపాడుకు చెందిన రమేష్ ప్రతి రోజూ కూలిపనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండే వాడు. రెండేళ్ల క్రితం అతడి ప్రవర్తనలో మార్పు వచ్చింది. పనికి వెళ్లటం మానేశాడు. ఒంటరిగా గడపటం ప్రారంభించాడు. చివరకు స్నానం చేయటం, అన్నం తినటం మానివేసి గెడ్డం పెంచుకుని తిరుగుతున్నాడు. తల్లిదండ్రులు గాలి సోకిందని భావించి భూత వైద్యుడికి వద్దకు తీసుకెళ్లి అంత్రాలు వేయించారు. ఫలితం లేకపోవడంతో చివరకు జీజీహెచ్ మానసిక వైద్యులను సంప్రదించారు. ఆరు నెలలుగా క్రమం తప్పకుండా నెలనెలా వైద్య పరీక్షలు చేయిస్తూ మందులు వాడుతూ ఉండటంతో ప్రస్తుతం అతను సాధారణ స్థితికి వచ్చాడు. నేడు ప్రపంచ స్కీజోఫ్రీనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం..



స్కీజోఫ్రీనియాడే పోస్టర్

గుంటూరు మెడికల్: చాలా మంది వైద్యంపై అవగాహన ఉండడం లేదు. మానసిక సమస్య వైద్యపరిధి కదానే అభిప్రాయం ఉంది. దీనితోడు వివిధ మానసిక సమస్యలతో బాధపడుతూ ఉండేవారు తొలుత భూత వైద్యులను సంప్రదించి చివరి స్థితిలో మానసిక వైద్యులను సంప్రదిస్తున్నారు. మానసిక వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి ప్రాథమిక దశలోనే వైద్యం చేయించటం వల్ల వారు సాధారణ స్థితికి అతి తక్కువ కాలంలోనే వస్తారు. లేదంటే దీర్ఘకాలం వ్యాధితో బాధపడుతూ అది చూసి కుటుంబ సభ్యులు కూడా కృంగిపోవాల్సి వస్తుంది.

వ్యాధి లక్షణాలు..

స్కీజోఫ్రీనియా వ్యాధి మానసిక వ్యాధి. ఏ వయసులో వారికైనా వస్తోంది. జెనిటిక్ సమస్యల వలన, దీర్ఘకాలంగా మానసిక ఒత్తిడికి గురవ్వటం, మెదడులో డోపమైన్ హార్మోన్ తేడా వలన వ్యాధి వస్తోంది. తల్లిదండ్రులకు మద్యం, పొగ తాగటం లాంటి వ్యసనాలు ఉంటే వారికి పుట్టే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి సోకిన వారు తనలో తాను నవ్వుకోటం, కోపంతో అరవటం, తిట్టటం, కొట్టడం, మాటలో మార్పు, ప్రవర్తనలో తేడా, ఎవరో కనబడుతున్నట్లు, తనను ఎవరో పిలుస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేయటం, చెవిలో మాటలు వినిపిస్తున్నట్లు చెప్పటం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ప్రతిరోజూ చేసే పనులు చేయకుండా మానివేయటం, పిలిచినా పలకకుండా ఏదో ఆలోచనలో పరధ్యానంగా ఉండటం, నిద్రపోకుండా, అన్నంతిన కుండా, స్నానం చేయకుండా ఉండటం, ఒంటరిగా గడపటం చేస్తుంటారు. ఇలాంటి వారిని స్కీజోఫ్రీనియా వ్యాధి గ్రస్తులుగా గుర్తించి తక్షణమే మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్‌లో మానసిక వ్యాధులతో వైద్యం కోసం ప్రతిరోజూ 150 మందికి పైగా రోగులు వస్తుంటారు. వారిలో 20 నుంచి 30 మంది స్కీజోఫ్రీనియా వ్యాధి సోకిన వారే. జీజీహెచ్‌లో ఈ వ్యాధి గ్రస్తులకు ప్రతి రోజూ 21 నంబర్ ఓపీ గదిలో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నాం. ఈ వ్యాధికి చికిత్స ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తెరిగి నాటు మందులనువాడటం, భూత వైద్యులను సంప్రదించటం మాని వేసి మానసిక వైద్యులను సంప్రదించాలి.

– వడ్డాది వెంకట కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్

వైద్యశాలకు నిమ్మరాజు పార్థివదేహం


నిమ్మరాజు సుబ్రహ్మణ్యం (ఫైల్)

గుంటూరు మెడికల్: మైనింగ్ జేడీగా ఉద్యోగ విరమణ చేసి న్యాయవాద వృత్తిపై మమకారంతో అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ చేయించుకుని ఈనెల 22న మృతిచెందిన నిమ్మరాజు సుబ్రహ్మణ్యం (71) పార్థివ దేహాన్ని మంగళవారం గుంటూరు వైద్య కళాశాలకు అందజేశారు. గుంటూరు పట్టాభిపురం 3వ లైనుకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు, ప్రముఖ అడ్వకేట్ నిమ్మరాజు సాంబశివ ఫణికిరణ్ తన తండ్రి చివరి కోరిక మేరకు వైద్య కళాశాల అనాటమి విభాగానికి పార్థివ దేహాన్ని అప్పగించారు. తన తండ్రి 2017 జూలై 26న తన మరణానంతరం పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అందజేయాలని వీలునామా రాశారని, అందులో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతిని కలిసి అందించామని వెల్లడించారు.

హజ్ యాత్రికుల బసకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఏపీ నుంచి 1813 మంది భక్తులు
- మదరసాలో ఏర్పాట్లను పరిశీలించిన డెప్యూటీ సీఎం అంజద్‌బాషా


భక్తుల బస ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజద్‌బాషా

పెదకాకాని: హజ్ యాత్రకు ఆంధ్రప్రదేశ్ నుంచి బయలు దేరే భక్తులు బస చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఆదేశించారు. బసకు కేటాయించిన నంబూరు మదరసా(సిరాజుల్ ఉలూమ్ అరబిక్ కళాశాల)ను మంగళవారం పరిశీలించారు. జూన్ 7వ తేదీ నుంచి 22 వరకు రాష్ట్ర నలుమూలల నుంచి 1813 మంది భక్తులు హజ్ యాత్రకు బయలు దేరి వెళుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించారు. అంజద్‌బాషా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హజ్ వెళ్లే ప్రయాణికుల కోసం హైదరాబాద్‌లో హజ్ హౌస్ ఉండేదని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత మొట్టమొదటి సారిగా గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు మదరసాలో బస చేసి బయలు దేరుతారన్నారు. ఇక్కడ నుంచి బస్సులో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి విమానంలో హజ్‌యాత్రకు పయనం అవుతారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హజ్ యాత్రకు వెళుతున్న భక్తులకు ప్రయాణం భారం కాకుండా ఒక్కొక్కరి బ్యాంక్ అకౌంట్‌కు రూ.80 వేలు చొప్పున జమ చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌వలి, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్‌అజామ్, రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు ఎస్‌ఎం జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్‌ఎం సుభాని ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర కొత్త కార్యవర్గం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తృతీయ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు మంగళవారం గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని అన్నమయ్య గ్రంథాలయంలో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షునిగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య (గుంటూరు జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చలపాక ప్రకాష్ (ఎన్టీఆర్ జిల్లా), కోశాధికారిగా నానా (నారిశెట్టి సత్యనారాయణ (గుంటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు), పొన్నూరి వేంకటశ్రీనివాసులు (ప్రకాశం), పి.హరికృష్ణారెడ్డి (చిత్తూరు), ఎ.జయప్రకాష్ (పీఎస్‌ఆర్ నెల్లూరు), ఎస్‌ఆర్ పృథ్వీ (తూ/గో జిల్లా), రాధేయ (అనంతపురం), మాధవీ సనారా (అనకాపల్లి జిల్లా), కార్యదర్శులుగా ఎస్‌ఎం సుభాని (గుంటూరు), కె.జె.రమేష్ (పల్నాడు జిల్లా), సి.ఎ.చంద్రశేఖర్ (చిత్తూరు), బుర్రి కుమార్ రాజా (శ్రీకాకుళం), పి.లక్ష్మణరావు (విజయనగరం), సిహెచ్.శర్మ (ఎన్టీఆర్ జిల్లా), కార్యవర్గ సభ్యులుగా ఎన్.ఖాసీంబి (గుంటూరు), కోపూరి పుష్పాదేవి (ఎన్టీఆర్ జిల్లా), ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి (ప/గో జిల్లా), సలహా మండలి సభ్యులుగా అడిగోపుల వెంకటరత్నం (చిత్తూరు), కాటూరు రవీంద్రత్రివిక్రమ్ (ఎన్టీఆర్ జిల్లా), గబ్బిట దుర్గాప్రసాద్ (కృష్ణా) ఎన్నికయ్యారు. 2023-2026 వరకు కార్యవర్గం పదవీ బాధ్యతల్లో కొనసాగుతారు.

ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌కు అసోసియేట్ హానర్ అవార్డు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫొటోగ్రాఫర్ జి.సునీల్ కుమార్‌కు లండన్ వేదికగా కొనసాగుతున్న బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ 'అసోసియేట్ హానర్' అవార్డును ప్రదానం చేసింది. విశేష ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు ఈ సొసైటీ ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ ఏడాది ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌ను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఒడిశాలోని కోరాపుట్, కైరాపూట్ కొండలపై నివసించే పురాతనమైన 'బోండా' గిరిజన తెగ ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే ఫొటోలను తన కెమెరాలో బంధించడమే కాకుండా సునీల్‌కుమార్ వాటితో ప్రత్యేకంగా డాక్యుమెంటరీని రూపొందించారు. దీనిని చూసి ముగ్ధులైన బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ న్యాయమూర్తులు, అధ్యక్షుడు సైమన్ అవార్డుకు సునీల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఏఎన్‌యూలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ బి.కరుణ అవార్డు గ్రహీతను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌కు లండన్‌కు చెందిన సంస్థ నుంచి అవార్డు లభించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత, అధ్యాపకురాలు డాక్టర్ జ్యోతిర్మయి, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ టి. శ్రీనివాసరెడ్డి, ఏపీపీఏ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఏపీ మార్కెట్ కమిటీల పెన్షనర్స్ హోమ్ కార్యాలయం ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆంధ్రప్రదేశ్ మార్కెట్ కమిటీల రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్‌కు కేటాయించిన పెన్షనర్స్ హోమ్‌ను మిర్చి యార్డ్ చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి గుంటూరులోని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చే మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు, పెన్షనర్స్‌కు ఈ హోమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ఏఎంసీ పెన్షనర్స్ అసోసియేషన్‌కు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సారథ్యంలో చేయడానికి తాము ముందు ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పెన్షనర్స్‌కు ఆయన హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, యార్డు ఇన్‌ఛార్జి కె.శివారెడ్డి, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ పీడీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.రత్నబాబు, గౌరవాధ్యక్షులు టీసీ ఆంజనేయులురెడ్డి, రెగ్యులర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎ.ఎ.భాస్కరరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కేవీ సత్యనారాయణ, గాంధీ, అనంతరాములు, పి.నాగబ్రహ్మం మిర్చి యార్డు అధికారులు సుబ్రమణ్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన కానిస్టేబుల్

తాడికొండ: నిద్రిస్తున్న కానిస్టేబుల్‌ను పాము కాటేసింది. ఈ ఘటన తుళ్లూరు మండలం అనంతవరం టీటీడీ ఆలయం దిగువన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తుళ్లూరు మండలంలో ఆర్-5 జోన్ బందోబస్తు నిమిత్తం ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన కానిస్టేబుల్ పవన్ సోమవారం రాత్రి కొండ దిగువన నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున కట్లపాము వచ్చి కుడి భుజం, ఎడమ చేతి ఉంగరం వేలు మీద కాటు వేసింది. వెంటనే సహ సిబ్బంది కారులో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అందిస్తున్నారు. బాధితుడిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పరామర్శించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

ముఖ్యమంత్రిగా జగనన్న ఉంటేనే..

సంక్షేమం-అభివృద్ధి

ఎంపీ నందిగం సురేష్


కేక్ కట్‌చేస్తున్న ఎంపీ నందిగం సురేష్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమం-అభివృద్ధి సమంగా ముందుకు సాగుతాయని వైఎస్సార్ సీపీ ఎంపీ నందిగం సురేష్ అన్నారు. ఇప్పటికే రూ.2.10 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ప్రజలకు అందించామనీ, 2019 ఎన్నికల కంటే పెద్ద మెజార్టీతో 2024లో ఎన్నికల్లో విజయం ఉండబోతోందని వివరించారు. అమరావతి ప్రాంతం ఉద్ధండరాయునిపాలెంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ విజయం సాధించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఇప్పటికే జిల్లాల విభజన జరిగిందనీ, మూడు రాజధానులు వ్యవహారం, కోర్టు కేసులను దాటుకుని వచ్చిన తర్వాత, ఆచరణలోకి వస్తే ఆదర్శప్రాయమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలబడుతోందని చెప్పారు. పాలన వికేంద్రీకరణ, గడప వద్దకు పాలన వంటి వాటి ఫలితాలను ప్రజలు అనుభవిస్తున్నారు. పారదర్శకంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం వల్ల పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే విజ్ఞాన శిబిరాలు

పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ప్రసన్న కుమార్


వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పౌరగ్రంథాలయ శాఖ డైరెక్టర్ ప్రసన్న కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకే గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల ముఖ్య ఉద్దేశమని పౌరగ్రంథాలయ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురించి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ప్రసన్నకుమార్‌కు వివరించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసి, వారిలో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించేందుకు వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు వై.బ్రహ్మయ్య, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కొరిటెపాడు(గుంటూరు): రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే సంబంధిత ఫర్టిలైజర్, సీడ్స్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని పురుగు మందుల పరీక్ష కేంద్రం(పీటీఎల్) ఏడీఏ టి.శ్రీనివాసరావు, విత్తన తనిఖీ అధికారి, గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి హెచ్చరించారు. గుంటూరు నగరంలో రెండు రోజులుగా మూడు బృందాలుగా ఏర్పడి విత్తన, పురుగు మందులు, ఎరువుల దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, కొరియర్ ఆఫీసులలో తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేని రూ.34,29,300 విలువ చేసే 6,752 మిర్చి విత్తన ప్యాకెట్ల అమ్మకాలు నిలిపివేశారు. అందులో భాగంగా మంగళవారం గుంటూరు నగరంలోని పట్నంబజారులోని ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులలో తనిఖీలు చేశారు. అధికారులు మాట్లాడుతూ విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని రైతులకు సూచించారు. పంట చేతికొచ్చే వరకు సంబంధిత బిల్లులు, విత్తన ప్యాకెట్లు, పురుగు మందుల డబ్బాలు, ప్యాకెట్లు భద్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని కోరారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. షాపుల్లో స్టాక్ బోర్డులు, విత్తనాలు, పురుగు మందులు, ఫర్టిలైజర్స్ వారీగా ధరల పట్టిక, స్టాక్ బోర్డును ప్రదర్శించాలన్నారు. అనంతరం షాపులలో రికార్డులను పరిశీలించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి.జనార్ధనరావు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని వైకుంఠపురం సమీపంలోని పోతురాజు కాలనీలో నివసించే రాడ్‌బెండింగ్ కార్మికుడు కొప్పుల రాజు అలియాస్ సోగ్గాడు చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మనస్పర్థల కారణంగా భార్య పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఈ నెల 20వ తేదీ రాత్రి కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలిక 8 గంటల ప్రాంతంలో దుకాణానికి వెళ్లి వస్తుండగా, బాలికను పిలిచి డబ్బులు ఇచ్చి సిగరెట్లు కూల్ డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. బాలికనూ రూ.10కి ఏమైనా కొనుక్కోమన్నాడు. తిరిగి దుకాణానికి వెళ్లి వచ్చిన బాలికను తాను ఉండే గదిలోకి తీసుకెళ్లాడు. కత్తితో బెదిరించి సుమారు మూడు గంటల పాటు బాలికను గదిలోనే ఉంచిన అతడు ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో బాలికను ఇంటికి పంపాడు. బాలిక కోసం అప్పటికే వెతుకుతున్న తల్లికి జరిగింది చెప్పింది. దీంతో స్థానికులతో కలసి రాజు ఉండే గదికి వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి జారుకున్నాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రులతో పాటు స్థానికులంతా కలసి పోలీసులకు 21వ తేదీ ఉదయం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని సోమవారం సాయంత్రం తెనాలి మార్కెట్ ఏరియాలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు కొప్పుల రాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు ఉన్నారు.